నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

## అధికారులకు జేపీఎస్‌ల వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు

కుభీర్, ఫిబ్రవరి 19 : కుభీర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నవనీత్ కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్‌లకు మండల పంచాయతీ కార్యదర్శులు జీపీల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం వినతి పత్రం అందజేశారు. వీధి దీపాలు, తాగునీటి పథకాల మరమ్మతులు, గ్రామంలో చెత్త సేకరణతోపాటు పారిశుధ్య నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. జీపీలకు నిధులు లేక గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సాధారణ నిధులను ట్రెజరీకి సంబంధం లేకుండా నేరుగా చెల్లింపులు జరిపే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జేపీఎస్‌లు తోట సంజీవ్, విజయ్‌కుమార్, కమల్‌సింగ్, కిరణ్, వినోద్, గంగాధర్, పాండుసింగ్, సాయి ఉన్నారు.

## రాజీమార్గం ద్వారానే కేసుల పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్



మాట్లాడుతున్న ప్రభాకర్‌రావ్

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారానే కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో గల ఆయన చాంబర్‌లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావ్ మాట్లాడుతూ.. మార్చి 8వ తేదీన జిల్లావ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్‌లు కొనసాగుతాయన్నారు. రాజీమార్గం ద్వారా శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. ఈ అవకాశాలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అడవిలో కార్చిచ్చు



అడవిలో మంటలు వ్యాపించడంతో కాలిన చెట్లు



అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

*ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించడంతో చెట్లు కాలిపోతున్నాయి. వేసవిలో కార్చిచ్చు ఏర్పడకుండా అటవీ శాఖ అధికారులు గ్రామీణులకు అవగాహన కల్పించాలి. కానీ.. కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో విలువైన చెట్లు కాలిపోతున్నాయి. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంద్రవెల్లి అటవీ శాఖ పరిధిలోని దోడంద, చిచ్‌ధరి ఖానాపూర్, అంజీ, వడగాం, డోంగర్‌గాం, పులిమడుగు, గట్టేపల్లి, దస్నాపూర్ అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడి హరితహారంలో నాటిన మొక్కలతోపాటు పొదలు, మొక్కలు, చెట్లు కాలిపోతున్నాయి. అంతేకాకుండా జంతువులు, పక్షులకు రక్షణ లేకుండా పోతుందని మండల ప్రజలు వాపోతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.* - ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19



## యూరియా కోసం ఎగబడ్డ రైతులు

యూరియా కోసం వేచి ఉన్న రైతులు

*దస్తురాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం, రేవోజిపేట గ్రామంలోని పీఏసీఎస్ గోదాంలో బుధవారం యూరియా బస్తాలను అధికారులు అందుబాటులో ఉంచారు. విషయం తెలుసుకున్న రైతులు తరలివచ్చి యూరియా కోసం ఎగబడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నారు. కాగా.. టోకెన్లు తీసుకోవడానికి గుమిగూడడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రానికి, రేవోజిపేట పీఏసీఎస్ గోదాంలకు 30 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలు వచ్చినట్లు ఏవో మానస తెలిపారు. ఇంకా 30 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇన్‌డెంట్ పెట్టినట్లు పేర్కొన్నారు* - దస్తురాబాద్, ఫిబ్రవరి 19

## విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : విద్యుత్ సౌకర్యం కల్పించాలని బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్ ఘాట్‌లో గుడిసేలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి నివాసం ఉంటున్న మాకు కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాత్రి విష పురుగులతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం, అధికారులు నిషాన్ ఘాట్‌లో నివాసం ఉంటున్న వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలక దేవిదాస్, మెస్రం భాస్కర్, కట్ట కృష్ణస్వామి, చట్ట చంద్రమౌళి, కట్ట కిష్టయ్య, గేడం కేశవ్, పొచ్చిరావ్, సంగీత, శబన, రేఖ పాల్గొన్నారు.




విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

## బాసర రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ రైల్వే జీఎం



బాసర రైల్వేస్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

బాసర, ఫిబ్రవరి 19 : బాసర రైల్వేస్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సందర్శించారు. పలు రైల్వేస్టేషన్‌ల భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం ప్రత్యేక రైలులో పలు రైల్వేస్టేషన్‌లను సందర్శించారు. ఇందులో భాగంగా ధర్మాబాద్, బాసర, నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లను పరిశీలించారు. బాసర రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికులకు ఏర్పాట్లు, భద్రతా చర్యల్లో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు.

## కల్తీలపై చర్యలేవీ?

### జనం ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేస్తరా?

● ఎఫ్ఎస్‌వో పోస్టు ఖాళీ ● పట్టించుకోని అధికారులు



ఇటీవల ఓ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్స్‌తోపాటు ఇతర తిను బండారాల దుకాణాల్లో తయారు చేసే ఆహార పదార్థాల్లో యథేచ్ఛగా కల్తీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫుడ్ సెఫ్టీ అధికారి పోస్టు కొన్ని నెలలుగా ఖాళీ ఉండడంతో వేరే జిల్లాకు చెందిన అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. జిల్లా కేంద్రంలోని ఈ కార్యాలయంలో పలు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పర్యవేక్షణ లోపించి హోటళ్లలో తయారు చేసే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలో 20 రెస్టారెంట్‌లు, 100 స్వీట్ హౌస్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, ఇతర తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు రెస్టారెంట్‌లలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దుర్వాసన వస్తుంది. వంటగదుల్లో కుళ్లిన పదార్థాలు, ఇతర వ్యర్థాలతో కంపు కొడుతాయి. ఆహార పదార్థాలు తయారు చేసే వారు చెమటతో నిండి, గుట్కాలు తింటూ ఉంటారు. రెస్టారెంట్లు, హోటళ్లలో కుళ్లిపోయిన వెల్లుల్లి, తినుబండారాల రుచి కోసం ప్రమాదకరమైన పౌడర్‌లు, ఇతర కెమికల్స్ వినియోగిస్తారు. ఆహార భద్రత, మున్సిపాలిటీ అధికారులు హోటళ్లు, మిఠాయి షాప్‌లలో తరచూ తనిఖీలు నిర్వహించి కల్తీ వస్తువులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జనం ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీలు చేపట్టడం లేదు.

### కొరవడిన తనిఖీలు..

గత నవంబర్ మొదటి వారంలో జిల్లా కేంద్రంలో పలు హోటళ్లలో ఫుడ్‌సెఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లు, బిర్యాని, స్వీట్ హౌస్‌లపై దాడులు నిర్వహించిన అధికారులు పలు లోపాలను గుర్తించారు. ఆహార భద్రత ప్రమాణాల ప్రకారం రిఫ్రిజిరేటర్‌లను సరైన ఉష్ణోగ్రతల్లో మెయింటేయిన్ చేయకపోవడం, నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్‌లలో కుళ్లిన మాంసం నిల్వ చేయడం, ప్రమాదకరమైన రంగులు కలిపిన చికెన్, చేపల లేబుల్, నాసిరకం పన్నీరు, మసాలాల వినియోగం, కుళ్లిన కూరగాయలను వినియోగించడం వంటివి వారి తనిఖీల్లో వెలుగు చూశాయి. హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంతోపాటు స్వీట్ హౌస్‌లలో మిఠాయిల తయారీలో క్యాన్సర్ కారక కృత్రిమ రంగులను వినియోగించడం, మరిగించిన నూనెలు తినుబండారాల తయారీకి వాడడం, పురుగులు పట్టి దుర్వాసనతో ఉన్న పప్పులు, ఇతర లోపాలను టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించి హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. పర్యవేక్షణ లేని కారణంగా హోటళ్లలో ఎలాంటి పదార్థాలు తయారవుతున్నాయో తెలియని పరిస్థితి నెలకున్నది. హోటళ్లలో కల్తీని నివారించి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యా వ్యవస్థలో ప్రతిష్టాత్మక మార్పులు

### సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య

● రూరల్ నిషాన్ ఘాట్ పరిశీలన ● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో సమావేశం



ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో మాట్లాతున్న ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య



దిలావర్‌పూర్ : ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు స్థల పరిశీలనకు వెళ్తూ..

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : విద్యా వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకురావడం కోసం ప్రయోగాత్మకమైన అడుగులు వేస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రెండేండ్లలో నిర్మించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. సమీకృత గురుకుల పాఠశాల స్థల సేకరణపై కృష్ణ ఆదిత్య బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీలు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి ఆదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీకృత గురుకుల పాఠశాలకు అవసరమైన స్థల సేకరణను వేగవంతం చేసి గురువారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం అదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్‌లో స్థలాన్ని కలెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణానికి అనువైన పరిస్థితులు, వాతావరణం వంటి అంశాలను తెలుసుకున్నారు. 20 ఎకరాల స్థలం కోసం సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని, నిషాన్ ఘాట్‌లో 38వ సర్వే నంబర్‌లో 20 ఎకరాల భూమిని సోషల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ వింగ్‌కు(ఈఈటీజీఈడబ్ల్యూఐడీసీ), నిర్దేశిత గడువులోగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, రెవెన్యు డివిజనల్ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

### ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. జిల్లాకు వచ్చిన అయన కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. వేసవి ప్రభావం ఇప్పటి నుంచే ప్రారంభమైందని మే, జూన్‌లలో భూగర్భ జలాలు అడుగంటడం వంటి అంశాలు కారణంగా నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉందన్నారు. కావున పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే మున్సిపల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య, కరెంట్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని చెప్పారు.

### ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల పరిశీలన

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 19 : సిర్గాపూర్ సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం కేటాయించిన భూమిని మంగళవారం బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య, నిర్మల్ కలెక్టర్ అభిలాష్ అభినవ్‌లు పరిశీలించారు. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 664లో గల 17 ఎకరాల 9 గుంటల భూమిని గతంలో కేటాయించినట్లు అధికారులు సూచించారు. ఈయన వెంట అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్ స్వాతి, ఆర్ఐ సంతోష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్, డీఐఈవో పరశురాం, డీఈ, ఏఈ ఉన్నారు.

## ప్రపంచ కప్ విజేత శివారెడ్డికి స్వాగతం

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి, భారత జట్టుకు ఖోఖోలో ప్రతినిధ్యం వహించి కప్ గెలవడం గర్వకారణమని పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్ధార్థ అన్నారు. ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో పోతిరెడ్డి శివారెడ్డి ఖోఖో ప్రపంచ కప్‌లో పాల్గొని విజయం సాధించి తిరిగి ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం వినాయక్ చౌక్‌లో తపాల ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బ్యాండ్ మేళాల మధ్య జాతీయ జెండాలను చేత పట్టుకుని కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆయనను పోస్టల్ ఎస్పీ సత్కరించి మెడల్స్ అందించారు. అదే విధంగా జూడో విభాగంలో ఇంటర్నేషనల్ క్రీడాకారిణి మలప్రభ కూడా ప్రతిభ చాటారని గుర్తు చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్ధార్థ మాట్లాడుతూ.. తపాల శాఖ ఉద్యోగి అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం శాఖతోపాటు జిల్లాకు గర్వకారణమన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ.. తాను వరల్డ్ కప్‌లో రాణించడానికి శాఖ అధికారుల సహకారం ఉందన్నారు. కష్టపడిన ప్రోత్సాహం లేకపోతే లక్ష్యాన్ని సాధించలేమన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ గంగాధర్, సిబ్బంది ఉత్తం కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.



పోతిరెడ్డి శివారెడ్డిని అభినందిస్తున్న పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్ధార్థ